


# మహాభారతం

## రాజ్యాన్ని కోరేహక్కు పాండవులకున్నదా? 31

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

### 1) 13 ఏళ్ళకు రాజ్యంపై హక్కు పోతుందా?

**విమర్శ:** "జూదంలో సర్వస్వాన్ని ఓడిపోయిన ధర్మరాజు ఉత్పాతాలకు భయపడిన ధృతరాష్ట్రుడు తమ రాజ్యాన్ని తమకివ్వగా రాజ్యాన్ని నిగ్రహించి తిరిగి వెళ్ళిపోయాడు. దుర్యోధనాదులు తండ్రిచేత మరల ధర్మరాజును జూదానికి పిలిపించి, 12 ఏళ్ళు అరణ్యవాసం ఒక ఏడు అజ్ఞాతవాసం పణంగా శకునితో తిరిగి జూదం ఆడించారు. ఆ జూదంలో కూడా ధర్మరాజే ఓడిపోయాడు. నియమం ప్రకారం 12 ఏళ్ళు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం పూర్తిగావించి, తమ రాజ్యాన్ని తమకివ్వమని అడిగారు. కాని దుర్యోధనుడు రాజ్యాన్ని తిరిగి ఇచ్చే ప్రసక్తే లేదని, సూదిమొన మోపినంత భూమిని కూడా ఇవ్వనని భీష్మించాడు. దీనికి కారణం 13 ఏళ్ళు ఒకరి రాజ్యం మరొకరి ఆధీనంలో ఉంటే హక్కుపోతుంది గనుకనే. ఈ ఉద్దేశంతోనే 12 ఏళ్ళు అరణ్యవాసం ఒక ఏడు అజ్ఞాత వాసం అనే నియమాన్ని ఏర్పాటు చేయటం జరిగింది"

ఇలా కొందరు వాదిస్తుంటారు. ఈ వాదనలను ఆధారం చేసుకొనే కొందరు సినిమా కవులు కథలు వ్రాస్తుంటారు. వాటిని చూచి అంతేనేమో అనుకుంటారు సామాన్య ప్రజలు. ఈ వాదన నిజమా?

**సమాధానం:** అసలు మహాభారతంలోని దుర్యోధనుడు ఈ ప్రశ్నను ఎప్పుడైనా వేశాడా? శ్రీకృష్ణుని రాయబార సమయంలో పాండవుల రాజ్యాన్ని పాండవుల కిమ్మని, ద్యూత నియమం ప్రకారం అది ధర్మమని శ్రీకృష్ణుడు చెబుతుంటే, "13 సంవత్సరాలు వారి అనుభవంలో లేని రాజ్యంపై వారికి హక్కు ఇంకా ఎక్కడుంటుంది? నీకు తెలియదా? ఇక్కడున్న పెద్దలకు తెలియదా? హక్కును కోల్పోయినా తిరిగి ఇమ్మని కోరటం నీకు ధర్మమా? అని దుర్యోధనుడు శ్రీకృష్ణుని ప్రశ్నించాలి గదా! ప్రశ్నించాడా? లేదే మరి. ఆ మహాభారతంలోని దుర్యోధనుడు ప్రశ్నించని విషయాన్ని ఈ భారతదేశంలోని దుర్యోధనులెందుకు ప్రశ్నిస్తున్నారు? బహుశా వీరికి చట్టం బాగా తెలిసి ఉండటం వల్లనేమో! ఆ దుర్యోధనుడు చట్టం తెలియని అమాయకుడు గనుక ఆయన తరపున వకాల్తా పుచ్చుకొని న్యాయస్థానంలో వాదించాలని భావిస్తున్నారేమో!

పోనీ వారి వాదన ప్రకారమే 13 ఏళ్ళకు హక్కుపోతుందే అనుకుందాం. మరి జూదంలో నియమం 13 సంవత్సరాల అరణ్యవాసం అని పెట్టకుండా 12 సంవత్సరాల అరణ్యవాసం, ఆపై ఒక సంవత్సరం జనపదాలలో అజ్ఞాతవాసం అని ఎందుకు నియమం పెట్టినట్టు? ఆ అజ్ఞాతవాసంలో ఒకవేళ బయటపడితే తిరిగి 12 ఏళ్ళు అరణ్యవాసం. ఒక ఏడు జనపదాలలో అజ్ఞాత వాసం చేయాలని, మళ్ళీ బయటపడితే అలాగే తిరిగి అరణ్య, అజ్ఞాతవాసాలు చేయాలని ఎందుకు నియమం పెట్టినట్టు? అలా-

శ్లో॥త్రయోదశేచ నిర్వృత్తే పునరేవ యథోచితం।
స్వరాజ్యం ప్రతిపత్తవ్య మితరైరథ వేతరైః॥
(సభా 76 అ.14శ్లో)

తా॥ పదమూడు సంవత్సరాలు (అరణ్య అజ్ఞాతవాసాలు) పూర్తి చేసుకొని తిరిగివచ్చిన తర్వాత మేము గాని, మీరు గాని ఎవరి రాజ్యాన్ని వారు తిరిగి పొందవచ్చు-అని ఎందుకు నియమం పెట్టినట్టు?

ఎందుకంటే 13 ఏళ్ళయినా 14 ఏళ్ళయినా, పాండవులకు

తమ రాజ్యంపై హక్కు పోదు గనుకనే ఇక్కడొక ఎత్తు వేసినారు దుర్యోధనాదులు. జూదంలో గెలిచేది ఎలాగైనా తామే గనుక; ధర్మరాజు ఓడిపోక తప్పదు గనుక; వారి రాజ్యాన్ని మాయా జూదంలో కాజేసినా తమ గ్రుడ్డి తండ్రి తిరిగి 13 ఏళ్ళ తర్వాతనైనా పాండవులకు ఇచ్చేస్తాడు గనుక; 12 ఏళ్ళు అరణ్యా వాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం అని పణం పెట్టి, ఆ అజ్ఞాత వాసంలో బయట పడితే తిరిగి 12 ఏళ్ళు అరణ్యవాసం అజ్ఞాత వాసం చేయాలని నిబంధన ఏర్పాటు చేశారు. ఎందుకంటే 12 సంవత్సరాలపాటు అరణ్యవాసం చేస్తుంటే అక్కడి క్రూర మృగాలవల్ల పాండవులకు ప్రమాదం ఎదురుకావచ్చు. ఒకవేళ ఏ ప్రమాదమూ లేకుండా అరణ్యవాసం పూర్తి చేస్తే; ఒక ఏడాదిపాటు నగరాలలో, జనపదాలలో అజ్ఞాతవాసం చేయాలి. ఈ సంవత్సరకాలంలో పాండవులను బయటపెట్టటం అంత కష్టం కాదు తమకు. అలా వారిని బయటపెట్టగలిగితే, తిరిగి 12 సంవత్సరాలు అరణ్యవాసం చేసి 1 సం॥ అజ్ఞాతవాసం చెయ్యాలి. మరల ఈ సంవత్సరకాలంలో వారిని బయటపెడితే తిరిగి అరణ్య అజ్ఞాతవాసం చెయ్యాలి. మరల ఈ సంవత్సరకాలంలో వారిని బయటపెడితే తిరిగి అరణ్య అజ్ఞాతవాసాలు చెయ్యాలి. ఇలా 12 సంవత్సరాలకొకసారి ఒక సంవత్సరంపాటు వారిని బయట పెట్టేందుకు తమ సర్వశక్తులు ఒడ్డితే, శాశ్వతంగా పాండవులు అరణ్యాలకే అంకితమౌతారు. రాజసూయయాగం ద్వారా సంప్రాప్తించిన పాండవుల రాజ్యసంపదలన్నింటిని ఏ ఆటంకం లేకుండా తామే అనుభవించవచ్చు. ఇదీ దుర్యోధనాదులెత్తు.

అందుకే "నీవు వారికి ఇచ్చిన రాజ్యాన్ని వారికే ఉండనీ. రాజ్యాన్ని మేము తిరిగి జూదంలో పణంగా పెట్టమనం. ఓడినవారు పన్నెండేళ్ళు వనవాసము, ఒక ఏడు జనపదాలలో అజ్ఞాతవాసము చేయాలని పణంగా పెడుతున్నాం. ఈ 13 సంవత్సరాలు ఓడినవారి రాజ్యం గెలిచినవారి ఆధీనంలో ఉంటుంది. అరణ్య అజ్ఞాతవాసాలను పూర్తి చేసి వచ్చిన తరువాత, ఎవరి రాజ్యం వారే తీసుకొని పరిపాలించుకుంటారు" అని ధృతరాష్ట్రునికి చెప్పి ఒప్పించారు. అంటే రాజ్యంపై హక్కు కోల్పోవటమనే ప్రసక్తే లేదు.

దీనినిబట్టి రాజ్యంపై గల హక్కును హరించటానికి కాదు ఈ పునర్ద్యూతం. పాండవులకు అనుభవం లేకుండా చేయటానికే. వారినలా అరణ్యఅజ్ఞాతవాసాల చక్రబంధంలో ఇరికించి వారి రాజ్యాన్ని తామే అనుభవించవచ్చునని వేసిన ప్రణాళిక ఇది.

13 ఏళ్ళకు హక్కుపోతుంది అని గోలపెట్టే ఈ దుర్యోధనాభిమానుల మాటనే తీసుకుందాం. ఎక్కడుంది ఈ విధమైన చట్టం? ఏ ధర్మశాస్త్రం చెబుతున్నది?

-వారికోసం **యాజ్ఞవల్క్యస్మృతి** ఏమి చెబుతున్నదో చూద్దాం.

**శ్లో॥ పశ్యతో 2బ్రువతోహానిః భూమేర్వింశతి వార్షికీ।**
**పరేణ భుజ్యమానాయా ధనస్యదశవార్షికీ॥**
**(యాజ్ఞవల్క్యస్మృతి-వ్యవహారకాండ)**

తా॥ తానుచూస్తూ ఉండగా నిరాటంకంగా తన భూమి ఇతరులచే అనుభవించబడుతున్నప్పటికీ 20 సంవత్సరముల వరకు దానిపై హక్కుపోదు, అదే ధనం గనుక ఐతే (చరాస్తి) పది సంవత్సరముల వరకు హక్కుపోదు. అంటే

తాను ఆక్షేపము తెలిపితే 20 సంవత్సరాల తరువాత కూడా తనకు దానిపై గల హక్కుపోదు. ఒకవేళ తనకు తెలిసీ ఆక్షేపము తెలుపకపోతే మాత్రం ఆ భూమిపై హక్కు 20 సంవత్సరముల వరకే ఉంటుంది. ఇది ఆనాటి ధర్మశాస్త్ర నిర్ణయం.

ఈ ధర్మశాస్త్ర వచనం ప్రకారం 13 ఏళ్ళు పాండవుల రాజ్యాన్ని దుర్యోధనుడు అనుభవించినప్పటికీ పాండవుల హక్కుకు ఏ భంగమూ లేదు. కనుక వారికి హక్కుపోయింది గనుకనే వారి రాజ్యం వారికివ్వనన్నాడనుట తప్పు. తమ రాజ్యాన్ని పాండవులు కోరే హక్కు లేదనుట తప్పు.

ద్యూతనియమం ప్రకారం 12 ఏళ్ళు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం చేసివచ్చిన పాండవులు, ఆ నియమం ప్రకారమే ఎవరి రాజ్యాన్ని వారు తీసుకొని పరిపాలించుకోవాలి గనుక, వారి రాజ్యాన్ని వారికివ్వటం దుర్యోధనుని యొక్క విధి, ధర్మము. ధర్మాన్ని తప్పే అధర్మపరుడు గనుకనే రాజ్యాన్ని తిరిగి ఇవ్వనని భీష్మించాడు దుర్యోధనుడు. అంతే తప్ప రాజ్యంపై హక్కు పాండవులకు పోలేదు. ఇక మరొక సందేహం

## 2) అజ్ఞాతవాసకాలం పూర్తి కాకుండానే పాండవులు బయటపడ్డారా?

దుర్యోధనుడు ఉత్తరగోగ్రహణమునకై విరాట రాజ్యంపై దండెత్తినప్పుడు గత్యంతరం లేని స్థితిలో ఉత్తరునికి సారధిగా, బృహన్నల రూపంలో ఉన్న అర్జునుడు కౌరవులనెదిరించాడు. గాండీవ ధనుష్టంకారం చేస్తూ అసహాయశూరుడై వచ్చిపడిన

అర్జునుని గుర్తించి ద్రోణుడు ప్రశంసించగా, దుర్యోధనుడు ఇలా అంటున్నాడు.

"ఆచార్యా! ధర్మరాజు మన చేతిలో ఓడినందున 12 సం॥లు అరణ్యవాసం ఒక ఏడు అజ్ఞాతవాసమును పాండవులు చెయ్యలి. వారికింకా అజ్ఞాతవాసకాలం పూర్తికాలేదు. వచ్చినవాడు అర్జునుడే గనుక ఐతే పాండవులు మళ్ళీ అరణ్యవాసం చెయ్యాలి.

**శ్లో॥లోభాద్వాతేన జానీయు: అస్మాన్వామోహ ఆవిశత్।**
**హీనాతిరిక్తమే తేషాం భీష్మోవేదితుమర్హతి॥**

**(విరాట 47అ.6శ్లో)**

**తా॥** పాండవులు రాజ్యంపై లోభంతో తమ ప్రతిజ్ఞను మరిచిపోయారా? లేక మనకే మోహం ఆవరించిందా? 13వ సంవత్సరం ఇప్పటికే గడిచిపోయిందా? లేక ఇంకా కొన్ని రోజులు మిగిలి ఉందా? ఇందులోని వాస్తవం తెలిసినవాడు పితామహుడు భీష్ముడే చెప్పాలి. ఈ విధంగా దుర్యోధనుడు సందేహాన్ని లేవనెత్తి ధర్మనిర్ణయాన్ని భీష్మునిపై పెట్టాడు.

దానికి భీష్ముడు సమాధానం ఇస్తూ అధికమాసాలతో లెక్క గట్టి ఇలా అన్నాడు.

**శ్లో॥ ఏషామభ్యధికా మాసాః పంచచద్వాదశ క్షపాః**
**త్రయోదశానాం వర్షాణాం ఇతిమేవర్తతే మతిః**

**(విరాట 52 అ. 4 శ్లో)**

**తా॥** ఈ విధంగా అధిక మాసాలతో లెక్కకట్టిగా పదమూడు సంవత్సరాలు పూర్తయి ఐదు నెలల పన్నెండు రోజులు గడిచి పోయినవి. ఇది నా అభిప్రాయము-అని

భీష్ముడిలా నిర్ణయం చేసి చెప్పినపుడు దురోర్యధనుడు అప్పటికింకేమీ మాట్లాడలేదు, కాని ద్రుపదపురోహితుడు పాండవరాయబారిగా వచ్చి, "ద్యూతకాల నిర్ణయాన్ని బట్టి పాండవుల రాజ్యాన్ని పాండవులకిచ్చి అందరూ శాంతితో జీవించండి" అనగా, కర్ణుడు దుర్యోధనుని వైపుకు చూచి ఆ దూతతో ఇలా అంటున్నాడు. "ధర్మరాజు ద్యూతకాల నిర్ణయాన్ని బట్టి అరణ్యవాసం పూర్తిగావించి, అజ్ఞాతంలో తెలియబడినందున మరల అరణ్యవాసము చెయ్యాలి. పాండవులకు రాజ్యకాంక్ష ఉంటే ప్రతిజ్ఞ ప్రకారం తిరిగి వనవాస, అజ్ఞాతవాసములు చేసి రావాలి" అని. దీనిని బట్టి దుర్యోధనునిది కూడా ఇదే అభిప్రాయం అనుకోవాలి.

భీష్ముణ్ణి న్యాయనిర్ణయం చేయమన్నాడు దుర్యోధనుడు. కనుక ఆయన నిర్ణయాన్ని తాను అంగీకరించటం ధర్మం. అలా అంగీకరించిట్లే అపుడు మౌనంగా ఉండి, ఇప్పుడు కర్ణుని ద్వారా చెప్పించటం ఏమిటి? ఒకవేళ అది కర్ణుని అభిప్రాయమే అయితే తాను దానిని ఖండించాలి గదా! ఖండించలేదు గనుక తన అభిప్రాయం కూడా అదేననుకోవాలి.

అజ్ఞాతవాసకాలం నిజంగా పూర్తి చేశారా లేదా? అనే విషయాన్ని నిగ్గు తేల్చటానికి మరొక ఆధారం కూడా ఉన్నది. అరణ్యవాసకాలంలో అర్జునుడు దేవలోకం వెళ్ళాడు. ఆ సమయంలో తనను కోరివచ్చిన ఊర్వశిని తిరస్కరించటంలో "నీవు నపుంసకుడివై, సిగ్గు విడచి, స్త్రీల మధ్య చరించెదవు గాక!" అని శాపం పెట్టింది ఊర్వశి. అప్పుడు దేవేంద్రుడు "అర్జునా! ఊర్వశి శపించినందుకు చింతించకు. అజ్ఞాతవాస సంవత్సరం పాటు ఈ శాపం నీకు వరంగా పరిణమిస్తుంది. అజ్ఞాతవాసకాలం పూర్తికాగానే తిరిగి నీవు పురుషత్వాన్ని పొందుతావు" అని చెప్పాడు. కనుక ఆ ఊర్వశిశాపం ఒక సంవత్సరం ఉంటుంది గనుక అంతకన్న ఒక్కరోజు ముందుగ కూడా నపుంసకత్వం పోదు. దీనిని బట్టి కూడా భీష్ముని నిర్ణయం సబబేనని తెలుస్తుంది.

మరొక ప్రమాణం కూడా ఉన్నది. అరణ్యవాసకాలం చివరిలో యమధర్మరాజు యక్షరూపంలో ధర్మజుని కొన్ని ప్రశ్నలు వేయగా ధర్మరాజు అన్నింటికీ సరైన సమాధానాలు చెప్పాడు. అప్పుడు యక్షుడు వరములిచ్చెదనుకోరుమనగా, ధర్మరాజు "మేము 1 సంవత్సరం పాటు అజ్ఞాతవాసం చేయవలసిన సమయం ఆసన్నమైనది. ఆ సమయంలో మమ్మ ఎవ్వరూ తెలిసికొనకుండునట్లుగ వరమివ్వవలసినది" అని కోరాడు ధర్మరాజు. అప్పుడు యమధర్మరాజు "మీరు మీ మీ స్వరూపములతో సంచరించున్నప్పటికీ త్రిలోకాలలో ఎవ్వరికీ తెలియబడకుండా మీరు సంచరించగలరు. మీరు మనస్సులలో ఏయే రూపాలను సంకల్పించు కుంటారో ఆయారూపాలను మీ ఇచ్ఛానుసారం ధరించగలుగు తారు" అని వరాన్ని అనుగ్రహించాడు.

ఈ వరప్రభావమును బట్టి అజ్ఞాతవాసం సంవత్సరం పూర్తి కాకపోతే అర్జునుడు తెలియబడటం అసంభవం, తెలియబడ్డాడు అంటే ఆనాటికి అజ్ఞాతవాసం పూర్తి గావించినట్లే. కనుక అజ్ఞాత వాసకాలంలో పాండవులు తెలియబడ్డారు అనటం కేవలం కర్ణదుర్యోధనుల అహంకార ప్రలాపమే గాని, వారు తెలియబడుట అసంభవం. దీనిని బట్టి భీష్మవాక్యం కూడా యదార్థమే నని ఋజువౌతున్నది. ఆ కర్ణదుర్యోధనులు అనిపించినట్లు ఈనాడు ఎవరికైనా అనిపించిందీ అంటే వారిది కూడా అలాంటి దుష్టబుద్ధియే అయి ఉంటుంది.

### 3) ఐదూళ్ళిమ్మని కోరటంలో ఎత్తులు, జిత్తులు ఏమైనా ఉన్నాయా?

అరణ్యఅజ్ఞాత వాసాలను పూర్తిగావించి వచ్చిన పాండవులు ద్యూత నియమం ప్రకారం తమ ఇంద్రప్రస్థ రాజ్యాన్ని తమకిమ్మని, లేదా కనీసం ఐదుగురి పోషణ కొరకు ఐదూళ్ళైనా ఇమ్మని కోరారు. ఇలా ఇమ్మని కోరటంలో ఎన్నో ఎత్తులు, జిత్తులు ఉన్నాయని, అవి దుర్యోధనుడు ఎట్టి పరిస్థితులలోను ఇవ్వటానికి వీలు లేనివని; అందుకే తమ తప్పేమీలేదని లోకానికి చెప్పటానికే. ఇలా అడిగి రాయబారాలు సాగించాలరని, పాండవులపై తమ ద్వేషాన్ని వెళ్ళగ్రక్కుతున్నారు దుర్యోధనాభిమానులైన కొందరు. వారి వాదనను సమర్ధించు కొనేందుకు ఈ ఐదు ఊళ్ళను వారే సెలెక్ట్ చేసుకున్నారు.

1. కుశస్థలం, 2. వృకస్థలం, 3. మాకంది, 4. వారణావతం 5. ఏదైనా మరొక గ్రామమని ఒకరు వ్రాస్తూ కుశస్థలం యాదవులను జయించి కర్ణుడు సంపాదించినదని; మాకందీ వారణావతాలు పాంచాలురనుండి లాగివేసి ద్రోణుడు, కౌరవులు అనుభవించేవని; వృకస్థలానికి కూడా ఇలాంటివే ఏదో కథ ఉంటుందని చెప్పి కర్ణద్రోణులనుభవించే వాటిని దుర్యోధనుడెలా ఇవ్వగలుగుతాడు? అని వాపోయాడాయన.

ఇక మరొకరు 1.కుశస్థలి 2. మాకంది 3. వారణావతం 4. హస్తినాపురం 5. ఇంద్రప్రస్థం అని ఐదింటినీ పేర్కొని- కుశస్థలి యాదవులను జయించి కర్ణుడు సంపాదించినదని, మాకంది ద్రుపదుని జయించి సుయోధనాదులు గురుదక్షిణగా ఇచ్చుటచే ద్రోణునిదని; ఇక వారణావతం పాంచాలురను జయించి భీష్ముడు సంపాదించుకొన్నదని; హస్తినాపురం సుయోధనుని రాజధానియని, ఇంద్రప్రస్థం పాండవులదే అయినా సుయోధనుడు జూదంలో గెల్చుకొనినదని ఈ విమర్శకుడు చక్కని కథను అల్లి ఎవరెవరివో సుయోధనుడెలా ఇస్తాడని; హస్తినాపురం, ఇంద్రప్రస్థం రెండూ గుండెకాయలని, రాజధానీ నగరాలని; వీటినడిగింది సంధికోసమా? సంగ్రామం కోసమా? అని తెలివివి ప్రదర్శించాడు.

ఇక ఇలాంటి విమర్శకులను ఆదర్శంగా తీసుకొని సినిమాలలో వారిష్టం వచ్చిన గ్రామాలపేర్లను చేర్చి రక్తి కట్టించి, దుర్యోధనుడు అమాయకుడైనట్లు, పాండవులు పరుల సొమ్ము కోసం ఆశపడే దుర్మార్గులైనట్లు చిత్రించి ఆనందించారు.

ఇక ఇటీవల జెమిని టి.వి.లో మహాభారతం సీరియల్ వచ్చింది. దానిలో శ్రీకృష్ణుడు 5 ఊళ్ళ పేర్లు చెబుతూ శుక ప్రస్థము, ఇంద్రప్రస్థము, జయంతము, హస్తినాపురం, అంగ రాజ్యం అని వారికి తోచిన వాటిని వారు కలిపి మంచి రక్తి కట్టిస్తున్నారు.

అసలు పాండవులు కోరినది గ్రామములా? నగరాలు, రాజధానులా? అనే విషయం వీరికి పట్టదు. మహాభారత గ్రంథంతో వీరికి పనిలేదు. ఎలాగైనా పాండవులను దుర్మార్గులుగా చూపించాలి? దుర్యోధనుని అమాయకుడిగా, మంచి వాడిగా చూపాలి. అంతే.

ద్రుపదుని జయించింది సుయోధనాదులా? భీమార్జునులా? ద్రుపదుని బాణధాటికి నిలువలేక కర్ణుడు పారిపోయాడు, దుర్యోధనాదులు వెనుదిరిగారు. అర్జునుడు ద్రుపదుని బంధించి తెచ్చి, గురువు పాదాలపై పడవేశాడు-ఇదీ భారత కథ. ఇక ఇంద్రప్రస్థం జూదంలో గెలుచుకున్నదా? మొదటి జూదంలో గెలుచుకున్నా, ధృతరాష్ట్రుడు తిరిగి ఇచ్చివేసి పంపించాడు. తిరిగి జూదానికి పిలిచి అరణ్యఅజ్ఞాతవాసాలు పణంగా పెట్టి, తిరిగివచ్చిన తర్వాత ఎవరి రాజ్యం వారికేనని నియమం పెట్టుకున్నారు. అది దుర్యోధనునిది ఎలా అవుతుంది?

అసలు గ్రంథంలో ఏమున్నది? దుర్యోధనా! పరద్రవ్యము నందు లోభబుద్ధి వద్దు

**శ్లో॥ అవిస్థలం వృకస్థలం మాకందీం వారణావతం।**
**అవసానం భవత్వత్ర కించిదేకంచ పంచమం॥**
**భ్రాతౄణాందేహిపంచానాం పంచగ్రామాన్ సుయోధన।**
**(ఉద్యో 31 అ.19-20 శ్లో)**

తా॥ అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం, నీకు తోచిన మరొక గ్రామం, మా ఐదుగురు సోదరులకు ఐదు గ్రామాలనిమ్ము-అని ధర్మరాజు సంజయరాయబార సమయంలో తెలియజేశాడు.

ఇలా పాండవులు కోరినవి 5 గ్రామాలనైతే ఇంద్రప్రస్థం, హస్తినాపురం మొదలైన రాజధానీ నగరాలను కోరినట్లు వ్రాయటం; వాటినెలా ఇస్తాడు దుర్యోధనుడు? అని దుర్యోధనునికి వకాల్తా పుచ్చుకోవటం ఎంత గొప్ప విమర్శ?

పైగా అవి ద్రోణునివి, భీష్మునివి, కర్ణునివి అని చెప్పటం ఏమి తెలివి? ద్రోణుడు, భీష్ముడు సింహాసనాధిష్టులై పరిపాలన చేశారా? యావత్ సామ్రాజ్యాన్ని తృణప్రాయంగా వదిలి భీష్మమైన ప్రతిజ్ఞ చేసిన వాడు; విచిత్రవీర్యమరణం తర్వాత రాజ్యాభిషిక్తుడవు కమ్మని సత్యవతి కోరినా, ప్రతిజ్ఞకే కట్టుబడి తిరస్కరించినవాడు అయిన భీష్ముడు వారణావతమనే

గ్రామాన్ని పరిపాలించాడా?

పోనీ భీష్ముని దొకటి, ద్రోణునిదొకటి, కర్ణునిదొకటి–మూడు గ్రామాలను పాండవులు కోరారనే అనుకుందాం. నిజంగా దుర్యోధనుడు శాంతికోసం ఆ గ్రామాలను ఇస్తానంటే వ్యతి రేకించే వారేనా ఆ ముగ్గురు? అసలు వారడిగినట్లు ఐదూళ్ళిచ్చి సంధి చేసుకోమని కోరినవారు భీష్మద్రోణులుగాదా! యుద్ధం చేయాలనే తపనతో వ్యతిరేకించినవాడు కర్ణుడు గాని, తానెప్పుడో సంపాదించిన గ్రామం పోతుందని సంధిని వ్యతిరేకించే వాడా కర్ణుడు? పాండవులు కోరిన 5 గ్రామాలు దుర్యోధనుడు ఇవ్వలేనివీ కాదు; అర్ధరాజ్యం కన్న ఎక్కువైనవీ కాదు; అవి నగరాలో, రాజధానులో కాదు; దుర్యోధనుని అధీనంలో లేనివీ కాదు.

పాండవులు కోరిన పంచగ్రామాలు అర్ధరాజ్యం కన్నా ఎక్కువైనవనే ఈ విమర్శకుల అభిప్రాయమే దుర్యోధనుని కున్నదా? లేక అవి అల్పమైన గ్రామాలేననే అభిప్రాయమున్నదా?

ఈ పంచగ్రామ సంధి ప్రస్థావనపై తండ్రితో దుర్యోధనుడేమన్నాడో చూడండి.

**శ్లో॥ యుధిష్ఠిరఃపురం హిత్వా పంచగ్రామాన్ సయాచతే।**
**భీతోహి మామకాత్సైన్యాత్ ప్రభావచ్చైవ మే విభో॥**

**(ఉద్యో 55 అ. 30 శ్లో)**

**తా॥** ప్రభూ! నా సైన్యానికి, నా ప్రభావానికి భయపడిపోయి యుధిష్ఠిరుడు రాజధానీ నగరాన్ని (ఇంద్రప్రస్థాన్ని) వదులు కొని ఐదు గ్రామాలను యాచించే స్థితికి వచ్చాడు–అన్నాడు దుర్యోధనుడు. దీనిని బట్టి ఆ ఐదూ గ్రామాలేనని తెలియుటలేదా?

అసలు ఈ గ్రామాలను దుర్యోధనుడు ఎందుకు ఇవ్వ నన్నాడో అతడి మాటల్లోనే చూద్దాం–ఉలూకుని ద్వారా పాండవులకు పంపిన సందేశంలో దుర్యోధనుడు–

**శ్లో॥ పంచగ్రామావృతాయత్నాన్నా2స్మాభిరప వర్జితాః॥**
**యుధ్యామహేకథం సంఖ్యే కోపయేమచపాండవాన్॥**

**(ఉద్యో 160 అ. 47 శ్లో)**

**తా॥** నీవు కేవలం 5 గ్రామాలనే యాచించినా నేనెందుకు త్రోసి పుచ్చానో తెలుసా? ఎలాగైనా మిమ్ము రెచ్చగొట్టి, కోపం తెప్పించి సంగ్రామభూమిలో మీతో యుద్ధం చేయుటకే.

ఇదీ దుర్యోధనుడు తిరస్కరించుటకు కారణం. దీనిని బట్టి పాండవులు ఏదో విధంగా సంధికై ప్రయత్నించారని, దుర్యోధనుడు ఎలాగైనా యుద్ధం జరగాలని కృతనిశ్చయుడై యున్నాడని ఋజువౌతున్నది. అయినప్పటికీ పాండవుల పద్ధతి ఈ విమర్శకులకు నచ్చలేదు. దుర్యోధనుని పద్ధతే నచ్చింది. దుర్యోధనుడే ధర్మాత్ముడుగా వీరికి కనిపిస్తున్నాడు. దీనికి కారణం ఎలాంటి వారికి అలాంటివారు నచ్చుతారేమో!

–ఇక కర్ణుని జీవితచరిత్ర గుణగణాలు–కవచ కుండల దానం గురించి **(వచ్చే సంచికలో..)**

## బాలమేధావి

పార్వతీపురం సమీపంలో నాగావళి, వేగావతి అనే రెండు నదుల సంగమం ఉంది. అక్కడ ఒక శివాలయం ఉంది. ఆ శివుని గుంపేశ్వరుడు–గుంపస్వామి అని భక్తులు సేవిస్తారు. కార్తీకమాసంలో నిత్యపూజలు జరుగుతాయి. శివరాత్రి పర్వదినాన విపరీతంగా భక్తజనావళితో సందడిగా ఉంటుంది. నేటికి కొనసాగుతుంది. సుమారు శతాబ్దంన్నర క్రితం మాట. అజ్జాడనుండి ఎద్దులబండిపై ఒక కుటుంబం గుంప బయలుదేరింది. శివరాత్రి పూజలు ముగించుకుని ఇంటిముఖం పట్టారు. పార్వతీపురం చేరగానే బండిని ఆపారు. అంగడిలో సామానులు కొంటున్నారు.

బుక్కావారి పుస్తకాలు దుకాణం వద్ద కొంటున్నారు. ఏడు లేక ఎనిమిదేండ్ల బాలుడు మారాం చేస్తూ "ఆ పుస్తకం కొనండి" అని తల్లిదండ్రులను అడిగాడు. ఆ బాలుని గోల విని దుకాణం యజమాని "బాబూ! ఆ పుస్తకంలో ఉన్న శ్లోకం చదువు" నవ్వుతూ అన్నాడు. "అది రామాయణ గ్రంథం. అందులో శ్లోకాలు నాకు కంఠస్థం వచ్చును" ఆ బాలుడు చెప్పాడు.

"అయితే ఏది చెప్పాలి! చూస్తాను!" దుకాణం యజమాని అన్నాడు. ఆ బాలుడు ఐదుశ్లోకాలు గుక్కతిప్పకుండా చెప్పాడు, రామాయణశ్లోకాలు అర్థవంతంగా ఆ బాలుడు వల్లిస్తుంటే అక్కడ ఉండేవారంతా ఆశ్చర్యపడ్డారు. ఆ దుకాణం యజమాని, బాలునికి రామాయణపుస్తకం కానుకగా ఇచ్చి, ముచ్చట పడ్డాడు.

**ఆ బాలుడే శ్రీమదజ్జాడ నారాయణదాసు. హరికథాపితామహుడు.**

– బెహరా ఉమామహేశ్వరరావు